క్లుప్తంగా

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



సీతారామపురం : మండల ఎంపీడీఓగా సాయిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మర్రిపాడు మండల డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ సీతారామపురం ఎంపీడీఓగా బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



ఆత్మకూరురూరల్: మహిమలూరులోని వీఎస్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శక్తి యాప్ వినియోగంపై ఆత్మకూరు ఎస్సై జిలానీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న నేరాలపై విద్యార్థినులు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళా పోలీసులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సైతో పాటు పోలీసు సిబ్బందిని హెచ్ఎం సోమవరపు భాస్కర్‌రెడ్డి శాలువాలతో సత్కరించారు.

వెంగమాంబకు రూ.24.68 లక్షల రాబడి



దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు ఆలయంలో హుండీ కానుకలను దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. గత నెల 20 నుంచి శుక్రవారం వరకు భక్తులు హుండీల్లో సమర్పించిన నగదు కానుకలను లెక్కించగా రూ.24,68,691 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వీ ఉషశ్రీ తెలిపారు. అలాగే ఆరు గ్రాముల బంగారం, 307 గ్రాముల వెండి కానుకలు వచ్చినట్లుగా వివరించారు. కోవూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు, విశ్రాంత బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, నర్రవాడ ఏపీజీబీ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



సంగం: మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి మధుచరణ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 586 మార్కులు సాధించిన మధుచరణ్ శుక్రవారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ మూడో జాబితాలో ఒంగోలు క్యాంపస్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా మధుచరణ్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

వరికుంటపాడు ఎంపీడీఓగా గోపి శ్రీనివాసులు



వరికుంటపాడు: మండల నూతన ఎంపీడీఓగా గోపి శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వింజమూరులో డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా పదోన్నతిపై వరికుంటపాడు ఎంపీడీఓగా నియమితులయ్యారు. కాగా నూతన ఎంపీడీఓకు సీనియర్ సహాయకుడు కొల్లు వెంకటాద్రి, పీఆర్ ఏఈ మనోహర్, ఏఓ, ఈఓపీఆర్డీ,తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఉదయగిరి: మండలంలో క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల వైద్యాధికారిణి శివకల్పన సూచించారు. ఉదయగిరి సీహెచ్‌సీలో వైద్యా ఆరోగ్య సిబ్బందితో సెక్టార్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు, కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యాఆరోగ్యశాఖ నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారిణి వినీత, సీహెచ్ఓ శివకుమారి, హెచ్ఈ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిలకు చేరుకోవాలంటే నరకమే

- కలువాయి–సోమశిల మార్గంలో దెబ్బతిన్న బ్రిడ్జి
- ఏడాదిగా పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- గుంతలో నిండిన డైవర్షన్ రోడ్డు
- అధ్వానంగా హైవే లింక్ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న పర్యాటకులు



డైవర్షన్ రోడ్డుపై వెళ్తున్న బస్సు

సోమశిల: జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన సోమశిల జలాశయాన్ని సందర్శించేందుకు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివస్తుంటారు. అయితే కలువాయి మండలం మీదుగా సోమశిలను చేరుకునేందుకు రెండు మార్గాలు ఉన్నప్పటికీ అవి అధ్వానంగా ఉండడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బ్రిడ్జికి మోక్షమెన్నడో..?

కలువాయి–సోమశిల మార్గంలో సోమశిల జలాశయం సమీపంలోని పరమానందయ్య ఆశ్రమం వద్ద ఉన్న బ్రిడ్జి దక్షిణ కాలువ లీకేజీ నీటి ఉధృతి కారణంగా ఏడాది క్రితం కొట్టుకపోయింది. అప్పట్లో ఒక వారం రోజుల పాటు సోమశిల–కలువాయి మధ్యన వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆ తరువాత ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. ఆ తరువాత బ్రిడ్జి నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఏడాదిగా వాహనచోదకులు డైవర్షన్ రోడ్డుపై ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. డైవర్షన్ రోడ్డుపై ప్రయాణించే క్రమంలో ద్విచక్ర వాహనచోదకులు అదుపుతప్పి పడిపోయి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి.

భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం

జలాశయం నుంచి డెల్టాకు 6వ క్రెస్ట్ గేట్ ద్వారా ఆప్రాన్ మీదుగా నీటిని విడుదల చేస్తున్న కారణంగా సోమశిల– కలువాయి మార్గంలో గత రెండు నెలలకుపైగా భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జలాశయం మీదుగా బస్సులను అనుమతించకపోవడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, కార్లను జలాశయం మీదుగా అనుమతించినా హిల్ కాలనీ నుంచి జలాశయం వరకు రోడ్డు గుంతలమయంగా ఉండడంతో నరకాన్ని చవిచూస్తున్నారు.

హైవే మీదుగా వెళ్లేందుకు తిప్పలే

సోమశిల గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి ఉంది. హైవే మీదుగా కలువాయికి వెళ్లేందుకు అవకాశం ఉంది. అయితే సోమశిల నుంచి ఉప్పలపాడు వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనచోదకులు నరకాన్ని చవిచూస్తున్నారు.



దక్షిణ కాలువ లీకేజీ నీటి ఉధృతికి కొట్టుకుపోయిన బ్రిడ్జి

తప్పిన పర్యాటక కళ

సోమశిల జలాశయంతో పాటు సోమేశ్వరస్వామి క్షేత్రాన్ని జిల్లాతో పాటు హైవే మీదుగా పెంచలకోన, తిరుమలకు వెళ్లే భక్తులు సందర్శించేందుకు వస్తుంటారు. ఏడాదిగా సోమశిలకు ఉన్న రెండు రోడ్లు అధ్వానంగా తయారవడంతో పర్యాటక కళ తప్పింది.

రామిరెడ్డిని కలిసిన కారుమూరి



కారుమూరిని సత్కరిస్తున్న రామిరెడ్డి

కావలి (జలదంకి): వైఎస్సార్‌సీపీ జిల్లా రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కావలిలోని ఆయన నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పట్టణ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కావలి నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలు, పార్టీ పరిస్థితులు, కార్యకర్తల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కారుమూరిని ప్రతాప్‌కుమార్‌రెడ్డి, నాయకులు శాలువాలతో సత్కరించారు.జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజు, పట్టణాధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పగడ్బందీగా భూముల రీసర్వే

దగదర్తి: మండలంలో భూముల రీ సర్వేను పగడ్బందీగా చేపడుతున్నామని తహసీల్దార్ పీ కృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఇప్పటికే తురిమెర్ల, యలమంచిపాడు, ఊచగుంటపాళెం, అనంతవరం, దామవరం, కామినేనిపాలెం, లింగాలపాడు, మార్లెపాడు, ఐతంపాడు గ్రామాల్లో రీ సర్వేను పూర్తిచేశామని తెలిపారు. రంగసముద్రంలో క్షేత్రస్థాయిలో సర్వేను పూర్తిచేశామని, వివరాలను రికార్డుల్లో నమోదు చేస్తున్నామన్నారు. శ్రీరామపురంలో మండల సర్వేయర్ రబియ ఆధ్వర్యంలో గ్రామసర్వేయర్లు సర్వే చేపడుతున్నారని తెలిపారు. మిగిలిన గ్రామాల్లో రీ సర్వే చేపట్టాల్సి ఉందన్నారు. రీసర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల్లో రికార్డుల్లో నమోదు చేసిన కుటుంబ సభ్యుల వివరాలు తప్పులు ఉన్నాయన్నారు. కొందరు రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చిన క్రమంలో వివాదాలు లేని జాయింట్ ఎల్‌పీఎంలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



సభ్యత్వాలను అందజేస్తున్న ఆపస్ నాయకులు

సోమశిల: ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అనంతసాగరం మండలంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ సభ్యత్వ నమోదును శుక్రవారం చేపట్టారు. సోమశిల, అనంతసాగరం, రేవూరులోని పాఠశాలల ఉపాధ్యాయులను నాయకులు కలుసుకుని సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి నల్లి బోయిన వెంకయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులకు డీఏ, పీఆర్సీని ప్రకటించాలని, ఎస్ఎస్‌సీ స్పాట్ వాల్యూయేషన్ భత్యాలను విడుదల చేయాలని,బోధనకు అడ్డంకిగా మారిన ఆన్‌లైన్ యాప్స్ నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆర్ వెంకటరమణారెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, అధ్యక్షుడు ఎం వెంకటేశ్వర్లు, నాయకులు ఎం శ్రీనివాసులు, వేణు గోపాల్‌రెడ్డి, బాలకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాఆరోగ్య సిబ్బంది

కలిగిరి: మండలంలోని సిద్ధనకొండూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వైద్యా ఆరోగ్య సిబ్బంది కీటక జనిత వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. దోమలతో డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి ఇళ్లలోని నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. దోమ కాటుకు గురికాకుండా దోమతెరలను వాడాలని తెలిపారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. హెల్త్ సూపర్‌వైజర్ నరసయ్య, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మీప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీప్రసన్న, ఏఎన్ఎం సుజాత, అశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూతపడిన వాటర్‌ప్లాంట్ పునఃప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను తెరిపిస్తున్న పంచాయతీ అధికారులు

కొండాపురం: మండలంలోని తూర్పుయర్రబల్లిలో రెండు నెలలుగా మూతపడి ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎట్టకేలకు పంచాయతీ అధికారులు పునఃప్రారంభించారు. సోలార్ సంస్థ ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను రాజకీయ కారణాలతో మూతవేశారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లడంతో డిప్యూటీ ఎంపీడీఓ బీ శ్రీనివాసులు శుక్రవారం గ్రామానికి చేరుకుని మూతపడిన వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు అప్పగించారు. ప్రజలకు తాగునీటిని అందించే వాటర్ ప్లాంట్ విషయంలో రాజకీయాలు తగవని, అందరూ సహకరించాలని కోరారు. ఈ విషయంలో ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ప్రదీప్, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ దీపిక

ఉదయగిరి: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ దీపిక శుక్రవారం తనిఖీ చేశారు. తొలుత ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న స్లాట్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏమైనా సాంకేతికపరమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్లాట్ విధానంలో దస్తావేజుల తయారీకి సంబంధించి పబ్లిక్ డేటా ఎంట్రీపై అవగాహన కల్పించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె వెంట సబ్‌రిజిస్ట్రార్ మెల్కి రోషన్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

వైభవంగా వార్షిక వేడుకలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని నడిమూరులో ఉన్న గుర్రప్పస్వామి, నాగార్పమ్మ, అంకాళమ్మ ఆలయంలో వార్షిక వేడుకలను ఆలయ ధర్మకర్త గురవారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉదయాన్నే దేవతామూర్తులకు విశేషాభిషేకాలు,పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

బెల్టుషాపులపై దాడులు

కొండాపురం: మండలంలోని సాయిపేట పంచాయతీ వెల్లటూరువారిపాళెంలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఓ వ్యక్తి నుంచి మూడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తి గతంలో కూడా రెండుసార్లు మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డాడని ఎక్సైజ్ సీఐ అబ్దుల్‌జలీల్ చెప్పారు. అయినా మళ్లీ మద్యం అమ్ముతుండడంతో కొండాపురం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని తెలిపారు.

డీసీపల్లిలో 316 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 316 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 602 బేళ్లు రాగా, 316 బేళ్లను విక్రయించామని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.159, సగటున రూ.206.81 ధర పలికిందని వివరించారు.

రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

దుత్తలూరు: మండలంలోని రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ సీహెచ్ మదన్‌మోహన్ శుక్రవారం తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో జీలుగలు, జనుములు, పిల్లిపెసర్లు 124 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విత్తనాలు అవసరమైన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుని పొందాలని కోరారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఎన్‌పీసీఐ లింక్ కాని రైతుల పేర్లను రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శించామని, రైతులు బ్యాంకులకు వెళ్లి తమ ఖాతాకు ఆధార్‌ను అనుసంధానం చేయించుకోవాలని సూచించారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ



ఆత్మకూరు: లారీ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటన నెల్లూరుపాళెం సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు..కృష్ణపట్నం పోర్టు నుంచి కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌కు ఐరన్ ఓర్ లోడ్‌తో వెళ్తున్న లారీ నెల్లూరుపాళెం సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి జాతీయ రహదారి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ నిద్రమత్తును వీడి ఒక్కసారిగా షడన్ బ్రేక్ వేయడంతో డివైడర్ మధ్యన వాహనం నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై ఎస్‌కే జిలానీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రమాదం జరిగిన ప్రదేశానికి కొంచెం దూరంలో దుకాణాలు ఉన్నాయి. లారీ కొంచెం ముందుకొచ్చి దుకాణాలపైకి వచ్చి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వం



రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరుతో హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటి అమలును విస్మరించి ప్రజలను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్ బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనల మేరకు పట్టణంలోని మేకపాటి కార్యాలయంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూఆర్‌కోడ్ పోస్టర్లను రూరల్ వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొమ్మిరెడ్డి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో వ్యవసాయ, డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తానని హామీఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. 2024 ఎన్నికల్లో తాను మారానని, జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఎక్కువ సంక్షేమాన్ని అందిస్తానని 143 హామీలను గుప్పించడంతో బాబు మాటలను ప్రజలు విశ్వసించి అధికారం అప్పగించారన్నారు. అధికారంలోకి వచ్చాక బాబు తన మోసపూరిత నైజాన్ని మరోమారు ప్రదర్శించారన్నారు. ఎన్నికలను హామీలను నెరవేర్చకుండానే సూపర్‌సిక్స్ హామీల అన్నింటిని అమలు చేశామని పార్టీ నాయకులతో చెప్పించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ భయపెట్టాలని చూస్తున్నారన్నారు. బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ కార్యక్రమం ద్వారా బాబు ఇచ్చిన హామీలను ఇంటింటికి తీసుకెళ్లి ఎండగట్టనున్నట్లు తెలిపారు. త్వరలో మేకపాటి విక్రమ్‌రెడ్డి నేతృత్వంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆత్మకూరులో నిర్వహించనున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ నాయకులు సానా వేణుగోపాల్‌రెడ్డి, గడ్డం శ్రీనివాసులు రెడ్డి, సర్పంచ్‌లు పీ వెంకటేశ్వర్లు, సతీష్, కోనేపల్లి సుబ్బారెడ్డి, గిరి నాయుడు, దాడి శ్రీనివాసులు నాయుడు, హజరత్ నాయుడు, తోడేటి అశోక్, పూర్ణ చంద్రరావు, మస్తానయ్య, మాధవ, బుజ్జయ్య, పవన్, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. 1984–85, 1985–86 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాల టాపర్‌గా నిలిచిన ఎస్‌కేబాబు (557)కు రూ.9వేలు అందజేశారు. అలాగే ద్వితీయ స్థానంలో నిలిచిన ముక్కు రాజేష్ (555)కు రూ.5వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నాగుపోగు మల్లెం కొండయ్య(550)కు రూ.3వేలును అందజేశారు. అలాగే 550 మార్కులు సాధించిన ఎస్‌డీ తబుసం విద్యార్థికి సీఐ శ్రీరామ్ తన తల్లి జ్ఞాపకార్థంగా రూ.5వేలు నగదు అందజేశారు. హెచ్ఎం నాగరాజు, విద్యా కమిటీ చైర్మన్ గుండు రాధా, పూర్వ విద్యార్థులు అమర సురేష్, ఐ నవీన్ కుమార్, కొప్పాల నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి రాలేదయ్యా



బిడ్డ ఆపరేషన్‌కు సీఎం సహాయనిధి రాలేదని మంత్రి పార్థసారథికి మొరపెట్టుకుంటున్న తండ్రి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని యాదవవీధిలో శుక్రవారం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి మంత్రి పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి పలువురు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తన కుమారుడు మూగ,చెవుడుతో బాధపడుతున్నాడని, ఆపరేషన్‌కు రూ.5 లక్షలు అవసరమని వైద్యులు చెపగా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నానని, ఐదు నెలలు గడిచినా అతీగతి లేదని యాదవవీధికి చెందిన ఓతండ్రి వాపోయాడు. అదే వీధికి చెందిన ఓ మహిళ శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాన్ని మార్చాలని ఎన్నిసార్లు విద్యుత్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో దెబ్బతిన్న విద్యుత్ సామగ్రిని మార్చేందుకు పంచాయతీ నుంచి రూ.15 లక్షలు కేటాయిస్తామని అంచనాలు ఇవ్వాలని ట్రాన్స్‌కో ఏఈను కోరినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ సృజన మంత్రికి విన్నవించారు. అలాగే పలువురు పక్కాగృహాలు, తల్లికి వందనం మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పొలం బాట విషయంలో ఇరువురి నడుమ ఘర్షణ

- ఇద్దరికి గాయాలు



గాయపడిన మహిళ, యువకుడు

అనుమసముద్రంపేట: పెద్దబ్బీపురంలో పొలం బాట విషయంలో ఇరువురి నడుమ ఘర్షణ తలెత్తింది. పోలీసుల కథనం మేరకు.. ఉత్తరకాలువ సమీపంలో జనసేన నేత ఊసా వెంకట్రావు, అదే గ్రామంలోని టీడీపీ వర్గానికి చెందిన మహిళా రైతు అనసూయమ్మకు పక్కపక్కన భూములున్నాయి. వాటి విషయంలో వారం రోజుల క్రితం ఇరువురి మధ్య ఘర్షణ తలెత్తింది. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. శుక్రవా రం అనసూయమ్మ భూమిలో వెంకట్రావు దౌర్జన్యంగా బాట చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఆమె అడ్డుకుంది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో అనసూయమ్మపై వెంకట్రావు దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. పక్కనే ఉన్న మరో యువకుడిని సైతం తీవ్రంగా కొట్టినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఎస్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వెంకట్రావును అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేసి కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



ఆత్మకూరు : బంగారు చీర అలంకరణలో వాసవీమాత



సంగం: తిరుమనకొండలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు/సంగం/ ఉదయగిరిరూరల్/ సీతారామపురం: శ్రావణ మాసం తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, పంటవీధిలోని రామాలయంలోని పార్వతీదేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారిని బంగారుచీరతో అలంకరించారు. మహిళా భక్తులు సామూహిక లలితా సహస్రనామ పారాయణం చేశారు. పార్వతిదేవి ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. ఉదయగిరి మండలం అప్పసముద్రం, గండిపాళెం, ఉదయగిరిలోని అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే ఆలయానికి చేరుకుని దేవతామూర్తులకు పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి అర్చనలు చేయించుకున్నారు. సీతారామపురం మండలం సిద్ధేశ్వరంలోని ఇష్టకామేశ్వరీదేవి, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లు విశేషాలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సంగం మండలంలోని దువ్వూరు త్రికోటేశ్వరస్వామి ఆలయం, వంగల్లులోని గంగాపార్వతి సమేత భీమేశ్వరాలయం, అన్నారెడ్డిపాళెంలోని ఆత్మారామస్వామి ఆలయం, సంగంలోని తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

తిక్కవరం పశువైద్యశాలలో ఏడీ తనిఖీలు



మర్రిపాడు: మండలంలోని తిక్కవరంలోని పశువైద్యశాలను పశు సంవర్ధకశాఖ ఏడీ ఎస్ జయచంద్ర శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు, టీకాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు.

104 వాహన సేవలు

ఉదయగిరి రూరల్: పట్టణంలోని బీసీ కాలనీలో 104 వాహన సేవలను శుక్రవారం అందజేశారు. వైద్యాధికారిణి వినీత 58 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి చేజర్ల విద్యార్థి



ప్రణతి

సోమశిల: చేజర్ల మండలం లుంబిని విద్యాలయానికి చెందిన పదోతరగతి విద్యార్థిని పీ ప్రణతి ట్రిపుల్‌ఐటీకి ఎంపికై ంది. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రణతి శుక్రవారం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ మూడో కౌన్సెలింగ్ ఫలితాల్లో ఒంగోలు క్యాంపస్‌లో సీటు సాధించింది. ఈ సందర్భంగా ప్రణతికి లుంబిని యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు